# మానవత్వం

- సి.ఎన్.చంద్రశేఖర్

"ఆ రామారావుతో నీకెలాంటి స్నేహం?" విష్ణుమూర్తి రాజీవ్‌ని అడిగాడు.

"అతను నా కొలీగ్. పైగా మన వీధిలోనే ఉన్నాడు కాబట్టి మంచి స్నేహమే ఉంది. ఎందుకలా అడిగావు?"

"రేపు రాత్రి అతన్ని చంపబోతున్నాను. ముందుగా చెబితే కాస్త మానసికంగా సిద్ధమౌతావని"

"నువ్వు అతన్ని చంపుతావా? ఆ విషయం నన్ను నమ్మమంటావా?" నవ్వుతూ అన్నాడు రాజీవ్.

"నువ్వు నమ్మినా, నమ్మకున్నా నాకు వచ్చిన ఇబ్బందేం లేదు. ఇంతకుముందు నన్ను ఎన్నోసార్లు అడిగావు నా ఉద్యోగం ఏమిటని. సమయమిస్తే చెప్తానన్నాను. ఇప్పుడు చెబుతున్నాను విను. నేనొక ప్రొఫెషనల్ కిల్లర్‌ని"

నమ్మలేనట్లు అతని వైపు చూశాడు రాజీవ్.

"నేను నమ్మను. నీవు జోక్ చేస్తున్నావు" విష్ణుమూర్తి అవునంటాడన్న ఆశతో అన్నాడు.

"అలాగే అనుకో. ఎల్లుండి ఉదయం పేపర్లో అతని మరణవార్త చదివాక నమ్ముతావు"

"విష్ణూ. ఆర్ యూ సీరియస్?"

"అవును"

"ఎందుకు చంపుతున్నావు రామారావ్‌ని?"

"చంపుతానని ఒప్పుకుని అడ్వాన్స్ తీసుకున్నాను కాబట్టి"

"అతను ఎంతో మంచివాడు విష్ణూ"

"కావచ్చు. కానీ నాకు ఆ వివరాలు అనవసరం. ఎవర్ని చంపాలి, ఎన్నిరోజుల్లో చంపాలి, నాకు అందే మొత్తం ఎంత, అడ్వాన్స్ ఎంత అన్న వివరాలు మాత్రమే నాకు కావాలి. నేను చంపబోయేవాడు మంచివాడా, చెడ్డవాడా, అతనేం చేస్తాడు అన్నవి నేను అడగను. అడగకూడదు కూడా"

రాజీవ్ షాకు నుంచి తేరుకుని ఆలోచించసాగాడు. మరుసటిరోజు ఆఫీసులో రామారావుతో అతనికి కలగబోయే ప్రమాదం గురించి హెచ్చరించి ఎక్కడికైనా వెళ్ళిపొమ్మని చెప్పాలని నిర్ణయించుకున్నాడు"

"నీవు రామారావుకు విషయం చెప్పి కాపాడే ప్రయత్నం చేశావంటే ముందు నువ్వు పైకి పోతావు. అలాంటి పిచ్చి ఆలోచనలు పెట్టుకోకు"

తన మనసు చదివినట్లు అతను మాట్లాడడం విని ఆశ్చర్యపోయాడు రాజీవ్.

"హత్య జరిగాక పోలీసులకు నా గురించి చెప్పినా అదే గతి పడుతుంది నీకు"

రాజీవ్ విష్ణుమూర్తి వైపు చూశాడు. తీక్షణమైన చూపులతో, భయంకరంగా కనిపిస్తున్నాడు విష్ణుమూర్తి. ఒళ్ళు జలదరించింది రాజీవ్‌కు. ఇన్నాళ్ళూ తను స్నేహం చేసిన విష్ణుమూర్తిలా లేడతను.

"నేను రేపే ఇల్లు ఖాళీ చేస్తాను. ఓ హంతకుడితో సహజీవనం చెయ్యలేను" విష్ణుమూర్తి మాటలకు బాధపడుతూ అన్నాడు రాజీవ్.

"ఆ పనిచేశావంటే పోలీసులకు అనుమానం వస్తుంది. హత్య విషయం తెలిసే నీవు ఖాళీ చేశావని అనుకుంటారు. హత్య జరుగుతుందని తెలిసీ పోలీసులకు చెప్పకపోవడం హత్య చేసినంత తప్పు. అందువల్ల నిన్ను అరెస్ట్ చేస్తారు"

నిస్సహాయంగా విష్ణుమూర్తి వైపు చూశాడు రాజీవ్.

"పైగా ఈ ఇంట్లో ఒంటరిగా ఉండలేకే నిన్ను చేర్చుకున్నది. వీధి చివర విసిరేసినట్లున్న ఈ ఇంట్లో ఒంటరిగా ఉండాలంటే నాకు భయం. రామారావు హత్యకు పథకం వేయడం కోసమే అతనింటికి దగ్గరగా ఉన్న ఈ ఇంట్లో చేరాను"

"హత్య చేయడానికి మాత్రం భయం లేదా?" వెటకారంగా అన్నాడు రాజీవ్.

"మనుషులను చంపాలంటే భయం లేదు. అది నా వృత్తి కనుక. ఎటొచ్చీ ఈ దయ్యాల గురించే నా భయం. ఈ మధ్య పెరట్లో రాత్రివేళ చప్పుళ్ళు, మాటలు వినిపిస్తున్నాయి. గమనించావా?"

లేదన్నట్లు తల అడ్డంగా ఆడించాడు రాజీవ్. అతని కళ్లల్లో భయం.

"ఈ రోజు గమనించు" అంటూ విష్ణుమూర్తి పడుకున్నాడు. రాజీవ్ కూడా పడుకున్నాడు. కానీ నిద్రపట్టలేదు. విష్ణుమూర్తితో స్నేహం చేసినందుకు, ఆ ఇంట్లో చేరినందుకు బాధపడసాగాడు.

* * *

అతనికి విష్ణుమూర్తితో నెలక్రిందట పరిచయం అయింది. అనంతపురంలో ఓ ప్రభుత్వ కార్యాలయంలో పనిచేస్తున్న అతనికి కర్నూలుకు ట్రాన్స్‌ఫర్ అయింది. కర్నూలు ఆఫీసులో రిపోర్ట్ చేసిన రోజే విష్ణుమూర్తి ఏదో పని పడి ఆ ఆఫీసుకు రావడం జరిగింది. రాజీవ్‌ని చూసి "నమస్తే. నా పేరు విష్ణుమూర్తి. మీరు కొత్తగా వచ్చారా?" అని అడిగాడు.

"అవును"

"నేనూ అదే అనుకున్నాను. ఈ ఆఫీసుకు తరచుగా వస్తుంటాను నేను. మిమ్మల్ని ఇదివరకు చూడలేదు కనుక ఈ మధ్యే రిపోర్ట్ చేసి ఉంటారని అనుకున్నాను"

"ఈరోజే రిపోర్ట్ చేశాను"

"ఇల్లు దొరికిందా?"

"ఏదీ ఈరోజే కదా వచ్చాను. ఇంకా ప్రయత్నించలేదు"

"మా ఇల్లు చాలా పెద్దది. అందులో నేనొక్కడినే ఉంటున్నాను. మీకు అభ్యంతరం లేకపోతే మీరూ అందులో ఉండొచ్చు. అద్దె చెరిసగం వేసుకుందాం. మీకు పెళ్లైందా?"

"ఇంకా లేదు. ప్రస్తుతానికి ఒంటరివాణ్ణి"

"అయితే సాయంత్రం నేను వచ్చి మా ఇంటికి తీసుకెళతాను. మీకు నచ్చితే చేరిపోదురు"

సాయంత్రం విష్ణుమూర్తితో వెళ్ళి అతని ఇల్లు చూశాడు రాజీవ్. చాలా పాత ఇల్లు అది. వీధి చివర్లో అటూ ఇటూ ఇళ్ళు లేక విసిరేసినట్లుంది. ఆ ఇంట్లో చేరడానికి సంశయించాడు రాజీవ్. అతనికి రాత్రుల్లో ఒంటరిగా పడుకోవాలంటే భయం. అతనికి దయ్యాలంటే భయం. దయ్యాలుంటాయని నమ్మకం. చిన్నప్పట్నుంచీ తన పల్లెలో విన్న దయ్యం గురించిన కబుర్లు అందుకు కారణం.

"మీకు క్యాంపులు ఉంటాయా?" రాజీవ్ విష్ణుమూర్తిని అడిగాడు.

"ఉండవు. వేరే ఊరికి వెళ్లాల్సిన అవసరం లేదు. మీ భయం నాకర్థమైంది. ఇంత పెద్ద ఇంటిలో ఒంటరిగా ఉండలేక మిమ్మల్ని చేరమంటున్నాను. ఒకవేళ నేను ఊర్లో ఉండని పరిస్థితి వస్తే మీకు తోడుగా పడుకోవడానికి ఎవరినైనా అరేంజ్ చేస్తాను"

"ఫర్వాలేదు. మా అటెండర్లు వస్తారులెండి. అద్దె ఎంత?"

"వెయ్యి రూపాయలు. మీ వాటా అయిదు వందలే"

రాజీవ్‌కు అద్దె అయిదువందలే అన్న విషయం ఎంతో నచ్చింది. వెంటనే ఆ ఇంటిలో చేరడానికి తన అంగీకారం తెలిపాడు. కొద్దిరోజుల్లోనే రాజీవ్ విష్ణు మూర్తికి మంచి స్నేహితుడయిపోయాడు. ఇద్దరూ కలిసి సినిమాలకు, హోటల్స్‌కు వెళ్ళేవారు. అయితే విష్ణుమూర్తి తను ఏ ఉద్యోగం చేస్తున్నాడో రాజీవ్ ఎంత అడిగినా చెప్పలేదు. డబ్బులు మాత్రం ఎక్కువగానే ఉండేవి అతని దగ్గర. వారం రోజుల క్రితం బాత్‌రూమ్ కని అర్ధరాత్రి నిద్రలేచిన రాజీవ్‌కు విష్ణుమూర్తి మెలకువగా కూర్చుని ఉండడం చూసి విషయమేమిటని అడిగాడు. పెరట్లో ఏవో మాటలు విన్పిస్తున్నాయని, అవి మనుషులు మాట్లాడే మాటల్లా లేవని చెప్పాడు విష్ణుమూర్తి.

రాజీవ్ భయపడిపోయాడు. బాత్‌రూమ్‌కు వెళ్ళే ఆలోచన మానుకుని ముసుగేసుకుని పడుకున్నాడు. ఆ తర్వాత ఆ విషయం గురించి మర్చిపోయాడు. మళ్లీ ఈరోజు విష్ణుమూర్తి ఆ మాటలు తిరిగి వినిపిస్తున్నాయని చెప్పడం అతన్ని భయపెట్టింది. ఆరాత్రి చాలా ఆలస్యంగా నిద్రపట్టింది అతనికి.

* * *

తనని ఎవరో నిద్రలేపుతుంటే బలవంతంగా కళ్ళు తెరుచుకుని చూశాడు రాజీవ్. ఎదురుగా విష్ణుమూర్తి నిలబడి ఉన్నాడు.


"ఒకసారి పెరట్లోకి రా. ఆ చప్పుళ్ళు మళ్లీ వినిపిస్తున్నాయి"

"నాకు భయం. నువ్వా కళ్ళు మూసుకుని పడుకో"

"పోనీ ఇక్కడ్నుంచే విను. ఏవో మాటలు వినిపించడం లేదూ?" అన్నాడు విష్ణుమూర్తి.

విసుగ్గా లేచి కూర్చున్న రాజీవ్‌కు ఆ మాటలు వినిపించసాగాయి. ఇద్దరు వ్యక్తులు మాట్లాడుకుంటున్న శబ్దం. అయితే ఆ మాటలు స్పష్టంగా లేవు. ఇద్దరూ ఒకేసారి మాట్లాడుతున్నట్లుంది. కళ్లు పెద్దవి చేసుకుని విష్ణుమూర్తి వైపు చూడసాగాడు రాజీవ్.

"బహుశా ఆ మాటలు ఆ ఇద్దరు ప్రేమికులది అయి ఉంటుంది" అన్నాడు విష్ణుమూర్తి.



"ఏ ప్రేమికులు?"

"ఈ ఇంట్లో ఆత్మహత్య చేసుకున్న ప్రేమికులది. దాదాపు ఐదేళ్ల క్రిందట జరిగిందది. నేను ఈ ఇంట్లో చేరాకే ఆ విషయం తెలిసింది నాకు"

భయంతో వణికిపోతున్న రాజీవ్‌ని చూసి ప్రక్కన కూర్చుని భుజం మీద చెయ్యి వేసి "సారీ.. ఇప్పుడు చెప్పి ఉండకూడదు నీకు ఆ విషయం. ధైర్యంగా ఉండు. నేనున్నానుగా. నీకేం భయంలేదు. దయ్యాలు మనుషుల కంటే హానికరం కావు" అన్నాడు విష్ణుమూర్తి.

"మనం రేపు ఈ ఇల్లు ఖాళీ చేసేద్దాం"

"రేపు కాదు ఎల్లుండి. నేను ఈ ఇంట్లో ఉంటేనే రామారావును చంపడం సులభంగా ఉంటుంది. రేపు ఆ పని కాగానే ఎల్లుండి ఎవరి దారిన వాళ్ళు వెళ్ళిపోదాం"

"నేను మాత్రం రేపే వెళ్ళిపోతాను" మొండిగా అన్నాడు రాజీవ్.

"ఎక్కడికి? రామారావు దగ్గరికా? పిచ్చిచేష్టలు చెయ్యొద్దు. మనం ఇద్దరం ఎల్లుండి వెళ్ళిపోదాం. అంతవరకూ మనిద్దరం కలిసే ఉండాలి" గదమాయించాడు విష్ణుమూర్తి.

"సరే" అని మనసులోనే విష్ణుమూర్తిని తిట్టుకుంటూ ముసుగుతన్ని పడుకున్నాడు రాజీవ్.

* * *

ఆఫీసులో రామారావుని చూస్తూంటే ఎంతో జాలి వేసింది రాజీవ్‌కు.



# నమ్మకం

జీవితంలో దశల్లాగే కెరీర్‌లో కూడా దశ లుంటాయి. 'స్క్రిప్ట్‌కి తగ్గట్టుగా నటించడం కత్తిమీద సామే. నేను ఇండస్ట్రీలోకొచ్చాక చాలారకాల పాత్రలు వేశాను. ఇప్పుడు దిరైజింగ్ చిత్రంలో కూడా ఓ ఛాలెంజింగ్ పాత్రలో కన్పిస్తాను. ఈ చిత్రం కోసం నా బాడీ లాంగ్వేజ్‌ని కూడా మార్చుకున్నాను. నా హెయిర్‌స్టయిల్, డ్రెస్ అన్నీ మారిపోతాయి. నా లుక్ చాలా డిఫరెంట్‌గా ఉంటుంది. ఇలాంటి పాత్రలే ముందు ముందు చేయమని అడిగితే చాలా బావుంటుంది. అయితే ప్రేక్షకుల అభిరుచులు మారుతున్నాయి. దానికి తగ్గట్టుగా మనం మారాలి' అంటోంది రాణీ ముఖర్జీ.

అతని దగ్గరికి వెళ్ళి విషయం చెప్పేద్దామనుకున్నాడు. తీరా అతని దగ్గరగా వెళ్లాక విష్ణుమూర్తి హెచ్చరిక గుర్తొచ్చి ధైర్యం చేయలేకపోయాడు.

రామారావుకు భార్య ద్వారా చాలా ఆస్తి సంక్రమించింది. దాంతో ఇల్లు కట్టుకున్నాడు. కారు కొన్నాడు. మిగిలిన డబ్బులు బ్యాంకులో దాచుకున్నాడు. 'జీవితాన్ని ఎంజాయ్ చేస్తాడు. అందరితో మంచిగా ఉంటాడు. మరి అతన్ని ఎవరు చంపాలనుకుంటున్నారు? రామారావుకు ఆడవాళ్లతో పరిచయాలు ఎక్కువ. అదే ఇప్పుడు అతని ప్రాణం తీస్తుందేమో' అనుకున్నాడు రాజీవ్.

"హలో రాజీవ్"

ఆలోచనలో ఉన్న రాజీవ్ ఉలిక్కిపడి చూశాడు. ఎదురుగా రామారావు నవ్వుతూ నిలబడి ఉన్నాడు.

"ఇందాకటి నుంచీ చూస్తున్నాను. నా సీటు వరకూ వచ్చి మళ్ళీ ఏదో పనున్నట్టు వెళ్లిపోతున్నావు. ఏమిటి సంగతి?"

"ఏంలేదు. రేపు ఊర్లో ఉంటావా నువ్వు?"

"ఉంటాను. ఎందుకలా అడిగావు?"

"ఊరికే. ఆదివారం కదా. మీ ఇంటికొచ్చి కాసేపు సరదాగా మాట్లాడుకుందామని"

"అంతేనా? తప్పకుండా రా. రేపు ఉదయం నీకోసం ఎదురుచూస్తూ ఉంటాను" అంటూ వెళ్ళిపోయాడు రామారావు.

"నీవు ఈలోకంలో ఉంటే... నేను మీ ఇంటికి రావడం మాత్రం ఖాయం. నీ మరణవార్త విని నీ శవాన్ని చూడడానికి రావాలి కదా" మనసులో బాధగా అనుకున్నాడు రాజీవ్.

* * *

ఆ రోజు రాత్రి తొమ్మిదిగంటలకు ఇంటికి వచ్చాక విష్ణుమూర్తిని చూసి "చంపేశావా?" అని అడిగాడు రాజీవ్. కళ్ళు పెద్దవిగా చేసుకుని చూస్తూ. అవునన్నట్టు తలూపి తను తెచ్చిన సంచీ నుంచి ఓ కత్తి బయటకు తీశాడు. రక్తం అంటుకుని ఎర్రగా కనిపిస్తోందది. వాష్ బేషిన్ క్రింద కత్తిని పెట్టి శుభ్రం చేయసాగాడు విష్ణుమూర్తి.

"నిజంగానే చంపేశావా?" రాజీవ్ అడిగాడు.

"అవును"

"ఒక నిండు ప్రాణం తీయడానికి నీకు చేతులెలా వచ్చాయి. ఒక ప్రాణం తీయడం ఎంత పాపమో తెలుసా?"

"ఇది నా బ్రతుకు తెరువు"

"ఇంతకంటే భిక్షమెత్తుకోవచ్చుగా. పాపం. అతని పిల్లలు చిన్నవాళ్ళు. తండ్రి లేకుండా ఎలా బ్రతకగలరు వాళ్ళు" బాధ, కోపం మిళితమైన స్వరంతో అన్నాడు రాజీవ్.

"భోంచేశావా?" విష్ణుమూర్తి అడిగాడు.

"నాకు చెయ్యాలని లేదు. నువ్వు తిను. అనుకున్న పని పూర్తిచేశావుగా. తృప్తిగా తిను" కసిగా అన్నాడు రాజీవ్.

విష్ణుమూర్తి క్యారియర్ తెరచి వడ్డించుకుని తినసాగాడు. అతను హత్య చేసొచ్చి అంత నిబ్బరంగా ఉండడం రాజీవ్‌ని ఆశ్చర్యపరిచింది. భోజనమయ్యాక టీవీలో ఓ హిందీ సీరియల్ చూడసాగాడు విష్ణుమూర్తి. డిటెక్టివ్ సీరియల్ అది. ఆసక్తికరంగా ఉండడంతో రాజీవ్ కూడా చూడసాగాడు.

ఉన్నట్లుండి విష్ణుమూర్తి లేచి స్టాండుకు తగిలించి ఉన్న పాంటు జేబులోకి చెయ్యి పెట్టి చూసి "డామిట్. నా పర్సు రామారావు ఇంట్లో పడిపోయింది" అన్నాడు. రాజీవ్ విసుగ్గా అతని వైపు చూశాడు.

"నేను ఇప్పుడే వస్తాను" అన్నాడు విష్ణుమూర్తి చెప్పులేసుకుంటూ.

"జాగ్రత్త. త్వరగా వచ్చేయి" అన్నాడు రాజీవ్.

"అలాగే" అంటూ బయటకు దూసుకుపోయాడు విష్ణుమూర్తి.

* * *


గడియారం వైపు చూశాడు రాజీవ్. పన్నెండు దాటింది సమయం. 'పర్సు కోసం వెళ్ళిన విష్ణుమూర్తి పట్టుబడి ఉంటాడు. పోలీసులు అతనితో పాటూ తననూ అరెస్ట్ చేయడం ఖాయం' అనుకున్నాడు. ఇంతలో శబ్దమైతే చెవులు రిక్కించి విన్నాడు. ఇద్దరు వ్యక్తులు అస్పష్టంగా మాట్లాడుకుంటున్న శబ్దం. భయంతో వణికిపోసాగాడు. ఇంతలో తలుపు తట్టిన శబ్దమైంది. 'వచ్చింది విష్ణుమూర్తేనా? ఒంటరిగా వచ్చాడా లేక పోలీసులతో పాటు వచ్చాడా?" అనుకుంటూ వణికే చేతులతో తలుపు తెరిచాడు. ఎదురుగా రామారావు నిలబడి ఉన్నాడు. కెవ్వున కేకపెట్టి క్రింద పడిపోయాడు రాజీవ్.

* * *

"ఎలా ఉన్నారు?" మరుసటిరోజు ఉదయం రౌండ్స్‌కు వచ్చిన డాక్టర్ శ్రీకాంత్ రాజీవ్‌ను అడిగాడు.

"ఐ యామ్ ఫైన్ డాక్టర్. నేను ఇక్కడ ఎలా చేరాను?"

"మీ స్నేహితులు విష్ణుమూర్తి, రామారావు మిమ్మల్ని అడ్మిట్ చేశారు. కాస్త ఆలస్యమై ఉంటే మీ ప్రాణాలు దక్కేవి కావు. మీరు దేన్ని చూసో



భయపడినట్లున్నారు. ధైర్యంగా ఉండండి. రేపు ఉదయం మిమ్మల్ని డిశ్చార్జ్ చేస్తాను" అంటూ అతని బిపి, టెంపరేచర్ టెస్ట్ చేసి వెళ్ళిపోయాడు డాక్టర్.

"అంటే రామారావు దయ్యం కాదా? విష్ణుమూర్తి తను చంపానని చెప్పాడే' అని ఆలోచిస్తున్న రాజీవ్ విష్ణుమూర్తి రావడం చూశాడు. రామారావు బ్రతికున్నాడన్న విషయం అతనికి సంతోషాన్నిచ్చింది. నవ్వుతూ చూశాడు విష్ణుమూర్తి వైపు.

"నేను ఊరు వదిలి వెళ్ళిపోతున్నాను. నీవూ ఆ ఇల్లు ఖాళీ చేసి చిన్న ఇంట్లోకి మారిపో" కుర్చీలో కూర్చుంటూ అన్నాడు విష్ణుమూర్తి.

"నువ్వు రామారావును చంపలేదా?" అనుమానంగా అడిగాడు రాజీవ్.

"లేదు. అలా నటించాను. నేను ప్రొఫెషనల్ కిల్లర్‌నని అబద్ధం చెప్పాను నీతో. చీమకు కూడా హాని చేసే మనస్తత్వం కాదు నాది. కానీ నిన్ను మాత్రం చంపాలనుకున్నాను. అందుకోసం రాత్రింబవళ్ళు ఆలోచించి ప్లాన్ వేశాను. నీ గురించి, నీ మనస్తత్వం గురించి నీ స్నేహితులను విచారించాను. ఆడపిల్లలను ఆకర్షించి, వారిని ప్రేమలో దించి, వాడుకుని వదలించుకోవడం నీ హాబీ అని తెలిసింది. నీవు రాత్రుల్లో ఒంటరిగా ఉండలేవని, ఎవరో ఒకరు తోడు లేనిదే నిద్రపోలేవని. దానికి కారణం చిన్నప్పట్నించీ దయ్యాల గురించి నీలో పెరిగిన భయం. నీ పల్లెలో తెలిసినవారు కల్పించి చెప్పిన కథలూ, సంఘటనలు. ఏ ఊర్లో పనిచేసినా ఇద్దరు ముగ్గురు కలిసి ఉండే ఇల్లు తీసుకునేవాడివని, వాళ్ళ ఊళ్ళో అటెండర్లనో, నీ స్నేహితులనో నీ తోడు పడుకోమని అడిగేవాడివని తెలిసింది.

హైదరాబాద్‌లోని నాకు తెలిసిన వాళ్ళ ద్వారా నీకు కర్నూలు ట్రాన్స్‌ఫర్ చేయించాను. నీకంటే ముందే ఇక్కడికి వచ్చి నీ ఆఫీసులోని ఉద్యోగులతో పరిచయం చేసుకున్నాను. నిన్ను నా ఇంట్లో చేరేలా చేశాను. రేడియోలో రెండు ప్రోగ్రాములను ఒకేసారి రికార్డ్ చేసి, టేప్‌రికార్డర్‌లో ప్లే చేసి అవి దెయ్యాల మాటలుగా నిన్ను నమ్మించాను. రామారావును చంపినట్లు చెప్పి కోడిరక్తం పూసిన కత్తిని నీకు చూపించాను.

నిన్న రాత్రి పన్నెండుగంటలకు రామారావుకు ఫోన్ చేసి నీవు గుండెనొప్పితో విలవిలలాడుతున్నావని, కారు తీసుకురమ్మని బయటినుంచి ఫోన్ చేశాను. నేను ఊహించనట్లే ఆయన్ని చూసి దయ్యమనుకుని నువ్వు స్పృహ తప్పావు. నీ అరుపునకు భయపడి ఆయన బయటకు పరుగెత్తాడు. చాటునుండి జరిగింది చూసిన నేను నా పని పూర్తయిందని వెళ్ళిపోబోయాను. ఎలాగూ కొద్దిసేపట్లో నీవు ఛస్తావని తెలుసు. కాని ఎందుకో వెళ్ళిపోవడానికి మనసు రాలేదు. గబగబా నీ దగ్గరకు వచ్చి నాడి చూశాను. బలహీనంగా కొట్టుకుంటోంది. వెంటనే రామారావు ఇంటికి వెళ్ళి ఆయనకు జరిగింది చెప్పి ఆయన సహాయంతో నిన్ను ఈ హాస్పిటల్‌లో చేర్పించాను. నీవు బ్రతికి బయటపడ్డావు"

"నన్ను ఎందుకు చంపాలనుకున్నావు నువ్వు?" రాజీవ్ అడిగాడు.

"నీకు సరస్వతి గుర్తుందా? అనంతపురంలో మీ ఎదురింట్లో ఉండేది. అందంగా, చురుకుగా ఉండే ఆ అమ్మాయితో స్నేహం చేశావు. ప్రేమించానని చెప్పావు. ఆమెను నీ సరదాలకు వాడుకున్నావు. ఆమెకు కడుపొచ్చి ఆ విషయం నీతో చెప్తే నాకు సంబంధం లేదు పొమ్మన్నావు. జరిగింది తన తల్లిదండ్రులకు చెప్పే ధైర్యం లేక నీ తిరస్కారం భరించలేక ఆత్మహత్య చేసుకుంది. ఆ సరస్వతి అన్నయ్యని నేను. పై చదువులకు ముంబయ్ వెళ్ళిన నేను నా చెల్లెలి మరణవార్త విని అనంతపురం వచ్చాను. పెళ్ళి చేసి పంపవలసిన ఈ చేతులతో ఆమెను చితిమంటలకు ఆహుతి చేశాను. తిరిగి ముంబయ్ చేరిన నాకు సరస్వతి రాసిన ఉత్తరం అందింది. అన్ని విషయాలూ తెలిశాయి. నీ ఫోటో కూడా చూశాను. ఆ రోజే ఆమె చావునకు కారణమైన నిన్ను చంపాలని నిర్ణయించుకున్నాను. అయితే నా జీవితానికి, భవిష్యత్తుకు ప్రమాదం లేకుండా ఉండాలంటే నేను చంపినట్లు ఏ రుజువూ దొరకకూడదు. అసలే కూతుర్ని పోగొట్టుకుని కృంగిపోయిన నా తల్లిదండ్రులు నేను జైలుకెళ్తే బ్రతకరు. అందుకే నిన్ను చంపడానికి ఈ పద్ధతి ఎన్నుకొన్నాను"

"మరి నన్ను ఎందుకు బ్రతికించావు?" ఆశ్చర్యంతో ప్రశ్నించాడు రాజీవ్.

"నేను మనిషిని కనుక. మానవత్వం నాలో ఉన్నది కనుక. నీ కామవాంఛకు నా చెల్లి మరణం సంభవిస్తే నా లోని పగ, ద్వేషం వల్ల మరో వ్యక్తి మరణించడం జరిగితే మనిద్దరికీ తేడా లేదు, అందుకే నిన్ను బ్రతికించాను. నీ ప్రవర్తన మార్చుకోకుంటే ఇలాంటి ప్రమాదాలు పొంచి ఉంటాయని ఇప్పటికైనా గుర్తించు. ఇకనైనా ఆడవాళ్ళ జీవితాలతో ఆడుకోకుండా బుద్ధిగా పెళ్ళి చేసుకుని తృప్తిగా బ్రతుకు. ఎందుకంటే అందరిలో మానవత్వం ఒకే పాళ్ళలో ఉండదు. వస్తాను" అంటూ వెళ్ళిపోయాడు విష్ణుమూర్తి.

వెళ్తున్న అతనివైపే చూస్తూ చేతులు జోడించాడు రాజీవ్ కృతజ్ఞతతో.

★

## దిగులు

"శుక్రవారం వచ్చిందంటే నాకు చచ్చేంత దిగులేస్తుంది వదినా"

"ఎందుకని?"

"శని, ఆదివారాలలో టీవీ సీరియల్స్ ఉండవుకదా!"

## గయ్యాళి

"సరోజా! ఇన్నిరోజులూ మీ అత్తగారు చాలా మంచివారని చెబుతుండేదానివి. ఇప్పుడెందుకు గయ్యాళిగా మారారు?"

"ప్రతి టీవీ సీరియల్స్‌లోని గయ్యాళి అత్తగార్లను చూసి అలా మారారు."

-పి. అనసూయ (చెన్నై)

## నరకం

"అమ్మా! నన్ను ప్రేమిస్తున్న రమేష్ తనని పెళ్లి చేసుకుంటే స్వర్గం చూపిస్తానన్నాడే" చెప్పింది కుమారి.

"అలాగే చేసుకో తల్లీ. తరువాత అతనికి నరకం నేను చూపిస్తాను" అన్నది తల్లి.

## వెళ్లిపోయారు

"ఒరేయ్ శీనూ! మీ అక్కయ్యను చూడ్డానికి పెళ్లివాళ్ళు వచ్చారుకదా. ఏమయిందిరా" అడిగింది రాధ.

"వాళ్ళు మా సంబంధం వద్దని వెళ్లిపోయారాంటీ" చెప్పాడు శ్రీను.

"అదేంటి?"

"వాళ్ళు మా అక్కయ్యను నీ హాబీలు ఏంటని అడిగారు. టీవీ సీరియల్స్ చూడడం, బంగారు నగల సేకరణ అని అక్కయ్య చెప్పింది. అంతే వాళ్లు వెళ్లిపోయారాంటీ"

-మిల్క్ శీను (విజయవాడ)

